## క్లుప్తంగా

### కోతకు గురైన డొంకరోడ్డు



వీరులపాడు: ఇటీవల సంభవించిన భారీ వర్షాలకు గ్రామాల్లో పంట పొలాలకు వెళ్లే పలు డొంకరోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. డొంకరోడ్లకు గండ్లు పడి రాకపోకలకు అవకాశంలేక రైతులు అవస్థలుపడుతున్నారు. వీరులపాడు మండలంలోని పెద్దాపురంలోని ఏనుగుగడ్డ వాగుకు వచ్చిన భారీ వరదకు వాగుపరిధిలోని డొంకరోడ్లు దెబ్బతిన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి డొంకరోడ్లకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

### ఆర్యవైశ్య సంఘ నాయకుల హర్షం

కంచికచర్ల: వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ రోజును దేవాదాయశాఖ అధికారిక కార్యక్రమంగా ప్రకటించడంపై కంచికచర్ల ప్రాంతానికి చెందిన వాసవీ యువసేన, ఆర్యవైశ్య సంఘం నాయకులు గురువారం హర్షం వ్యక్తం చేశారు. అమ్మవారి ఆత్మార్పణ రోజైన మాఘశుద్ధ విదియ రోజున పెనుగొండలోని అమ్మవారికి ప్రభుత్వం ద్వారా పట్టువస్త్రాలు సమర్పించి అధికారిక కార్యక్రమాలు నిర్వహిస్తామని దేవాదాయ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీచేయడం హర్షణీయమని ఆర్యవైశ్య సంఘం నాయకులు దొడ్డా రామ్మోహన రావు, దివ్వెల ప్రసాద్, కపిలవాయి సుబ్బారావు, జులూరి విశ్వనాధం పేర్కొన్నారు.

### బాధ్యతల స్వీకారం



కంచికచర్ల: స్థానిక అగ్నిమాపక అధికారిగా పీఎన్ఎం కృష్ణమూర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఉమామహేశ్వర రావు ఉద్యోగవిరమణ పొందడంతో ఈ పోస్టు కొంతకాలంగా ఖాళీగా ఉంది. దీంతో విజయవాడలో పనిచేస్తున్న కృష్ణమూరి పదోన్నతిపై ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. కృష్ణమూర్తికి ఫైర్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

### ఈద్గాను పరిశీలించిన ఎమ్మెల్యే



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని బలుసుపాడు రోడ్‌లో ఉన్న ఈద్గాను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) గురువారం పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీవర్షాలు, వరదలకు కూలిపోయిన ఈద్గాలోని ప్రహరీని ముస్లిం నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. కూలిపోయిన గోడల పునర్నిర్మాణం, మరమ్మతుల కోసం అధికారులతో మాట్లాడారు. త్వరలో పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని ముస్లిం నాయకులకు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

### రూ.60వేలు విరాళం



నందిగామ టౌన్: చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళలు బాధితుల సహాయార్థం సేకరించిన రూ.60వేల విరాళాన్ని గురువారం నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్వాక్రా సభ్యులను అభినందించారు.

### పాఠశాల తనిఖీ

పెద్దాపురం(వీరులపాడు):ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా సులభరీతిలో విద్యాబోధన చేయాలని ఎంఈవో పాల్ కెనడీ సూచించారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలోని ఏహెచ్‌యుపి పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విధిగా ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలన్నారు. ముఖ్యంగా చదువులో వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించాలని వినతి

నందిగామ టౌన్: ఇటీవల కురిసిన వర్షాలు, వరదల కారణంగా గ్రామంలో దెబ్బతిన్న డ్రైనేజీవ్యవస్థను పునరుద్ధరించాలని కోరుతూ చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామ కూటమి నాయకులు గురువారం ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామంలోని ఎస్సీకాలనీలో డ్రైన్‌లు పూర్తిగా దెబ్బతినడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారన్నారు. సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం గ్రామ కార్యదర్శి సాయిరాంను కలిసి వినపతిపత్రం అందజేశారు.

# సాగుఖర్చుల కోసం వేతలు

- సాగుపనుల్లో నిమగ్నమైన రైతన్నలు
- పెట్టుబడి సాయం అందక అవస్థలు..
- భారీవర్షాలకు దెబ్బతిన్న పంటపొలాలు
- నష్టపరిహారం కోసం ఎదురుచూపులు



వరినాట్లు వేసేందుకు వ్యవసాయ భూమిలో మాను తోలుతున్న రైతు



నాట్లకు సిద్ధంగా ఉన్న వరినారు



మిర్చి నారు నాటేందుకు అచ్చు తోలుతున్న రైతు

నందిగామ టౌన్: సకాలంలో రుతుపవనాలు వస్తున్నాయనే సమాచారంతో ఈ ఏడాది ముందస్తుగా సాగు ప్రారంభించిన నందిగామ ప్రాంత రైతులకు అకాలవర్షాలు, భారీ వరదలు తీరని నష్టాన్ని మిగిల్చాయి. ముఖ్యంగా వరిపంట సాగు చేసిన రైతులు నష్టాలను చవిచూశారు. నిన్న మొన్నటి వరకు కురిసిన వర్షాలు...వరదలు తగ్గుముఖం పట్టడంతో నియోజకవర్గంలోని నందిగామ, కంచికచర్ల, చందర్లపాడు, వీరులపాడు మండలాల్లోని మాగాణి రైతులు మాను తోలి నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. మిర్చి రైతులు అచ్చుతోలి మిర్చినారు విత్తేందుకు సయామత్తమవుతున్నారు. ముఖ్యంగా వరిపంటకు సమయం దాటిపోతుండటంతో నాట్లు వేసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. మిర్చి సాగు చేపడుతున్న రైతులు సైతం మిర్చినారు నాటేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులు కూడా తిరిగి ఆయా పొలాలను సాగు చేసేందుకు సమాయత్తమవుతున్నారు. సాగు ఖర్చులకు నగదు దొరకక అవస్థలుపడుతున్నారు.

### వేలాది ఎకరాల్లో సాగు...

నందిగామ మండలంలో వరిపంటను రైతులు ఏడువేల ఎకరాలలో సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారుల లెక్కలు చెబుతున్నాయి. పత్తి 3,200ఎకరాలు, మిర్చి 1400ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నాలుగు వేల ఎకరాలలో వరిపంట తుడిచిపెట్టుకుపోగా, 750ఎకరాల పత్తి, 600ఎకరాలలో మిర్చిపంటలు నీటమునిగాయి. వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండుతాయనే ఆశతో చేపట్టిన సాగు కాస్తా.. భారీ వర్షాలకు దెబ్బతిని తీరనినష్టాన్ని మిగిల్చిందని రైతులు వాపోతున్నారు.

### పెట్టుబడి ఖర్చుల కోసం ప్రదక్షిణలు..

ఒకసారి వేసిన సాగు వరదకు కొట్టుకుపోగా మరోసారి సాగు చేసేందుకు పెట్టుబడి ఖర్చులకు చేతిలో చిల్లిగవ్వ లేక రైతులు అవస్థలు పడుతున్నారు. సాగు వదిలి పంట భూములను బీడు భూములుగా మార్చేందుకు మనసొప్పక అప్పో సొప్పో చేసి పంటలు సాగు చేద్దామనే ఆశతో పెట్టుబడి ఖర్చుల కోసం బ్యాంకులు, ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల చుట్టూ ప్రదక్షిణలు చేయక తప్పడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతుభరోసా పథకం కింద ఏటా పెట్టుబడి ఖర్చులకు నగదు అందించి తమకు అండగా నిలిచారని రైతులు గుర్తుచేసుకుంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వం మాత్రం పెట్టుబడి ఖర్చుల మాటలా ఉన్నా పంట నష్టపోయినా కూడా కనీసం పట్టించుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు.

### ఆలస్యం కానున్న వరిసాగు..

వరదలకు కొట్టుకుపోయిన పంటపొలాలు తిరిగి వరిసాగు చేయాలంటే ఆలస్యమయ్యేలా ఉంది. కొత్తగా నారు పోసినాట్లు వేసేందుకు మరో 45రోజులు ఆలస్యమవుతుందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంట నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

### నష్టపరిహారం పెంచాలి...



ఇటీవల కురిసిన వర్షాలు, వరదలతో పంట పొలాలు కొట్టుకుపోవడంతో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. వరికి ఎకరాకి రూ.30వేల వరకు ఖర్చయినందున నష్టపరిహారంగా ఎకరాకి కనీసం రూ.20వేలైనా అందించాలి. నష్టపరిహారంతోపాటు అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం కూడా అందించాలి.

చిలుకూరి బుచ్చిరెడ్డి, వల్లగిరి

### పెట్టుబడి సాయం అందించాలి...



వర్షాలు, వరదల కారణంగా వరి పంట పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. మరలా వ్యవసాయ భూములను సిద్ధం చేసుకోవటంతోపాటు నారు పోసి నాట్లు వేసేందుకు మరో 45రోజుల వరకు సమయం పడుతుంది. అప్పుడు పరిస్థితులు ఎలా ఉంటాయో అర్థం కావటం లేదు. భగవంతునిపై భారంవేసి సాగు చేపడుతున్నాం.

గోనెల సీతారామయ్య, కేతవీరునిపాడు

### సర్వర్లు పనిచేయక ఇక్కట్లు

జగ్గయ్యపేట: మండలంలోని అనుమంచిపల్లి ఇసుక స్టాకు యార్డు వద్ద గురువారం నుంచి ప్రారంభం కావాల్సిన ఇసుక విక్రయాలు సర్వర్‌లు పని చేయకపోవడంతో నిలిచిపోయాయి. సీఎం చంద్రబాబు ఇసుక విక్రయాల ఆన్‌లైన్‌ను మధ్యాహ్న సమయంలో ప్రారంభించారు. అయితే మైనింగ్ యాప్‌లో సర్వర్‌లు పనిచేయలేదు. దీంతో ఆయా సచివాలయాల పరిధిలో ఇసుక బుక్‌చేసేందుకు వీలులేక ప్రజలు ఇబ్బందిపడ్డారు. యాప్‌పనిచేస్తే శుక్రవారం ఇసుకవిక్రయాలు చేస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు .

### రైతులకు అవగాహన

గరికపాడు(జగ్గయ్యపేట):రైతులు పత్తి పంటలో గులాబీ రంగు పురుగును నియంత్రించుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) కోఆర్డినేటర్ కృష్ణంరాజు సూచించారు. గరికపాడులోని కేవీకేలో పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తిలో గులాబీ రంగు పురుగు ఉండే అవకాశం ఉందన్నారు. వీటి నివారణకు శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు. సస్యరక్షణ శాస్త్రవేత్త రాజశేఖర్, కేవీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### హక్కుల వేలం మరోసారి వాయిదా

వేదాద్రి(జగ్గయ్యపేట):గ్రామంలో వేంచేసియున్న యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో గురువారం నిర్వహించతలపెట్టిన వేలంపాటలు మరోసారి వాయిదా పడ్డాయి. ఆలయంలో కొబ్బరిచిప్పలు పోగు చేసుకోవటంతోపాటు పలు రకాల వేలంపాటలు నిర్వహించాల్సి ఉండగా పాటదారులు రాకపోవడంతో వేలాన్ని వాయిదా వేసినట్లు ఆలయ ఈవో హేమలతాదేవి గురువారం తెలిపారు. ఈ వేలం పాటలు వాయిదాపడటం ఇది నాలుగోసారి అని వివరించారు.

# 21నుంచి క్రీడా పోటీలు



పీఈటీలకు సూచనలిస్తున్న కంచికచర్ల ఎంఈవో బాలాజీ

వత్సవాయి : ఈనెల 21 నుంచి అండర్-14, 17 బాలబాలికల క్రీడాపోటీలను వత్సవాయి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఎంఈవో ఎల్.నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలని ఎంఈవో సూచించారు.

**23నుంచి కంచికచర్ల మండలంలో..**

కంచికచర్ల: మండల స్థాయి స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ ఈనెల 23వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని ఎంఈవో బాలాజీ తెలిపారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో పీఈటీలు, పీడీలకు స్కూల్‌గేమ్స్‌పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ 23న అండర్ 14, 17 బాలికలకు, 24న అండర్ 14, 17 బాలురకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, చెస్, యోగా అంశాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని పీఈటీ, పీడీలను ఆదేశించారు.

**25నుంచి జగ్గయ్యపేటలో...**

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట మండల 68వ స్కూల్ గేమ్స్ ఎంపికలు ఈనెల 25, 26తేదీల్లో జీవీజె జెడ్పీ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఎంఈవో ఎల్.చిట్టిబాబు, పేట బాలుర హైస్కూల్ హెచ్ఎం.ఎ.మాధవీలత బుధవారం తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్‌కు సంబంధించి ఎంపికలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన ప్రభుత్వ, గుర్తింపు పొందిన పాఠశాలల క్రీడాకారులు తమ ఆధార్‌కార్డు జిరాక్స్, ఎంట్రీ ఫారాలు, మిడ్ డే మీల్స్ ప్రొఫార్మా తీసుకునిరావాలని వారు సూచించారు. ఇతరవివరాలకు పేట ఎస్‌జీఎఫ్ ఇన్‌చార్జ్ ఎం.సొడానాయక్(సెల్: 91105 71722), నియోజకవర్గ ఇన్‌చార్జి జి.వెంకటేశ్వర్లు(సెల్:99482 25132 )సంప్రదించాలని వారు సూచించారు.

### వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి

కీసర(కంచికచర్ల):గణేష్ విగ్రహం ఊరేగింపులో టీడీపీ, వైఎస్సార్ సీపీ వర్గీయుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. మండలంలోని కీసర గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన ఈఘటనలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు గాయపడ్డారు. టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ నాయకుడి ఇంటి ప్రహరీ గేటును కారుతో ఢీకొట్టడంతోపాటు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడిచేశారు. దీంతో పలువురు గాయపడ్డారు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని ఇరువర్గాలకు సర్దిజెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తల్లీబిడ్డల ఆరోగ్యానికి పౌష్టికాహారం తప్పనిసరి



జగ్గయ్యపేటలో ర్యాలీలో పాల్గొన్న ఏసీడీపీవో నాగమణి, అంగన్‌వాడీలు, విద్యార్థులు



మక్కపేటలో విద్యార్థినులకు ఐరన్ ట్యాబెట్లు పంపిణీ చేస్తున్న వైద్యసిబ్బంది, అంగన్‌వాడీలు



ముండ్లపాడులో ఆరోగ్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది, పక్కన సీడీపీఓ లక్ష్మీభార్గవి

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): తల్లీబిడ్డల ఆరోగ్యానికి పౌష్టికాహారం తప్పనిసరని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీభార్గవి సూచించారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా గురువారం ముండ్లపాడు, పెనుగంచిప్రోలు అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులు, పిల్లలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో సంపూర్ణ పోషణ ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నారన్నారు. చిరుధాన్యాలతో మంచి ఆరోగ్యంతోపాటు రక్తహీనత తగ్గుతుందన్నారు. పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఆరోగ్యసిబ్బంది పరీక్షలు నిర్వహించారు. ఏబీపీ కోఆర్డినేటర్ మోహన్ సందీప్, అంగన్‌వాడీలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

**జగ్గయ్యపేట పట్టణంలో...**

జగ్గయ్యపేట అర్బన్ : పట్టణంలోని రెండో సెక్టార్ పరిధిలో ఉన్న జెడ్పీ బాలికల హైస్కూల్‌లో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. బాలికలకు హిమోగ్లోబిన్ శాతాన్ని పరీక్షించారు. సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఏసీడీపీవో నాగమణి, స్కూల్ హెచ్ఎం జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రసన్న వేణి, భానుమతి, కనకలక్ష్మి, వహీదా, రాజ్యలక్ష్మి, జ్యోతి, హసీనా, సీతామహాలక్ష్మి, శాంత, శాంతి, సఖియా, రాంబాయమ్మ, నాగమణి, రాజకుమారి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

**వత్సవాయి మండలంలో...**

మక్కపేట(వత్సవాయి): కౌమారదశలో ఉన్న బాలబాలికలు రక్తహీనత బారిన పడకుండా చూసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీభార్గవి, ఏసీడీపీవో నాగమణి సూచించారు. మక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వైద్య సిబ్బంది గురువారం హిమోగ్లోబిన్ శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే రక్తహీనత బారిన పడకుండా ఐరన్ కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. బీట్‌రూట్, క్యారెట్, ఆకుకూరలు, చిరుధాన్యాలు, గుడ్లు, పాలు తీసుకుంటే వ్యాధులు దరిచేరకుండా ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, హెచ్ఎం చిత్రాల వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# వరదలకు దెబ్బతిన్న పాఠశాల

- వరద ఉధృతికి కూలిన ముచ్చింతాల యూపీ పాఠశాల ప్రహరీ..
- నీట మునిగిన రికార్డులు
- తరగతి గదుల్లో ఇసుక మేట



కూలిన పాఠశాల ప్రహరీగోడ



వరదల కారణంగా బురదతో నిండిపోయిన ముచ్చింతాల పాఠశాల ఆవరణ(ఫైల్)



నీటిలో తడిసిపోయిన రికార్డులు



నీటిలో తడిసిన ఐఎఫ్‌పీ ప్యానెల్

ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): ఇటీవల కురిసిన భారీ వర్షాలు, సంభవించిన వరదల కారణంగా ముచ్చింతాల యూపీ పాఠశాల బాగా దెబ్బతింది. వరద నీరు పాఠశాల మీదుగా ప్రవహించగా, పాఠశాల ఆవరణ అంతా ఇసుక, మట్టి మేట వేసింది. తరగతి గదుల్లో ఐదు అడుగుల మేర వరద నీరు ప్రవహించింది.

**దెబ్బతిన్న ఐఎఫ్‌సీ ప్యానెల్స్..**

వరద బీభత్సానికి పాఠశాలకు తూర్పు, దక్షిణం వైపు ప్రహరీ గోడలు నేలకూలాయి. హెచ్ఎం గదిలోని రికార్డులన్నీ తడిసి ముద్దయయ్యాయి. రెండు ఐఎఫ్‌పీ ప్యానెల్స్, స్మార్ట్ టీవీ దెబ్బతిన్నాయి. టాయిలెట్ బ్లాక్‌లో ఇసుక మేట వేయగా, తలుపులు పూర్తిగా దెబ్బతిన్నాయి. పాఠశాల ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభం పడిపోవడంతో సరఫరా నిలిచిపోయింది. తరగతి గదుల్లో వరదనీరు చేరి చెక్క బెంచ్‌లు, ఫర్నీచర్ పాడయ్యాయి.

**కొట్టుకుపోయిన బియ్యం, గుడ్లు..**

ఆర్వో ప్లాంట్ దెబ్బతింది. 23 ట్యాబ్స్, తరగతుల్లోని లైబ్రరీ బుక్స్ నీటమునిగాయి. 210 కిలోల బియ్యం, 427 గుడ్లు, 520 చిక్కీలు, నూనె, పప్పులు, సరుకులు కూడా నీటికి కొట్టుకుపోయాయి. టైల్స్ పాడయ్యాయి. దీంతో వరదల కారణంగా పాఠశాలకు తీవ్రనష్టం వాటిల్లింది. గ్రామస్తుల సహకారంతో ఉపాధ్యాయులు పాఠశాలను శుభ్రం చేసుకున్నారు. ప్రభుత్వం స్పందించి వరదలకు దెబ్బతిన్న పాఠశాలకు మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

### రికార్డులు తడిసిపోయాయి



వరద మా పాఠశాలకు తీరని నష్టాన్ని మిగిల్చింది. పాఠశాలలో ఐదు అడుగుల మేర వరద నీరు ప్రవహించింది. పాఠశాలకు వచ్చే రోడ్డు తెగిపోయింది. విలువైన ఐఎఫ్‌పీ ప్యానెల్స్, స్మార్ట్ టీవీ కూడా వరద నీటిలో తడిసిపోయాయి. నష్టం వివరాలను ఎంఈవోకు నివేదించాం. ప్రస్తుతం తరగతిగదులను శుభ్రం చేసుకుని పాఠశాల నిర్వహిస్తున్నాం.

-బి.లింగయ్య, పాఠశాల హెచ్ఎం




నందిగామ మెయిన్‌బజార్ వినాయకుడితో కమిటీ సభ్యులు

### నిమజ్జనానికి తరలిన గణనాథులు



నందిగామ వాసవీ మార్కెట్ గణనాథుడు



పెనుగంచిప్రోలులో వినాయకుడు



నందిగామలో కనకతప్పెట్ల కళాకారుల ప్రదర్శన